
# 19 నుంచి నిర్మాణాల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగంపై సదస్సు

విజయవాడ (లబ్బీపేట): భవన నిర్మాణాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం (ప్రీకాస్ట్ విధానం) వినియోగంపై అవగాహన కలిగించేందుకు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రీ ఇంజినీర్డ్ స్ట్రక్చర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఎస్ఐ) కార్యదర్శి సీఏ ప్రసాద్ చెప్పారు. బృందావన కాలనీలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో పెప్స్‌కాన్ 2018 పేరుతో నిర్వహించే ఈ సదస్సులో ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ ఎస్‌పీ టక్కర్‌లు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సదస్సులో ఎమర్జింగ్ మోడరన్ కన్‌స్ట్రక్షన్స్ టెక్నాలజీపై నిపుణులు అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా టెక్నాలజీపై అవగాహన కలిగించేలా 40 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సులో ప్రీ ఇంజినీరింగ్ (స్ట్రక్చరల్‌స్టీలు- బిల్డింగులకై), ప్రీకాస్ట్ నిర్మాణాలు (కాంక్రీట్‌తో బిల్డింగ్‌లు, ఫ్యాక్టరీలకై), ఇతర నిర్మాణ నైపుణ్యతలు, ధ్వని ఉష్ణ నిరోధక పద్ధతులపై అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు.




బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సీఏ ప్రసాద్, రామ్‌నాథ్, సూర్యప్రకాష్

ఈ సదస్సులో నిర్మాణ సంస్థల వారికి, డెవలపర్స్‌కు, ప్రీ కాస్ట్‌పై అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నవ్యాంధ్ర రాజధానికి ఈ సదస్సు ఒక దిక్సూచిలా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ టీఐడీసీవో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ వి.రామ్‌నాథ్, పీఎస్ఐ ప్రెసిడెంట్ పి.సూర్య ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.